# అద్యతన దృష్టి

## సాహిత్య విమర్శ వ్యాసాలు

ముదిగంటి సుజాతారెడ్డి

రోహణమ్ ప్రచురణలు

# అద్యతన దృష్టి

## సాహిత్య విమర్శ వ్యాసాలు

**ముదిగంటి సుజాతారెడ్డి**

**రోహణమ్ ప్రచురణలు**
హైదరాబాద్

**ADYATHANA DRUSTI**
*A Collection of Literary Essays*

By **Mudiganti Sujata Reddy**

© Mudiganti Sujata Reddy

*First Edition* : 2014

*Pages* : 216

*Price* : ` **200/- $ 10**

*For Copies* :

**Mudiganti Sujata Reddy**
# 2-2-1105/21, Roahanam
Tilaknagar, Hyderabad 500 044
Ph: 040-2756 6534
&
All leadings Book shops

*Book Production* :
**T. Muralidhar Gowd**
9393 176 552

*Cover design*:
**T. Mallesh**

*D.T.P.* :
**K.B.T. Kondaiah**

*Published by* :
**Roahanam Prachuranalu**
# 2-2-1105/21, Roahanam
Tilaknagar, Hyderabad- 500 044

*Printed at :*
**Karshak Art Printers**
(*Multicolour Printers & Designers*)
40-APHB, Vidyanagar, Hyderabad - 500 044
Ph : 040-2761 8261

# సమీక్ష

**భా**ర్యాభర్తలిద్దరూ సంస్కృత భాషా సాహిత్యాలలో కంఠ దఘ్నమైన పాండిత్యం కలవారు కావడం చాలా అరుదైన సంఘటన. సుజాతా గోపాలరెడ్డి దంపతులు అంటే నాకున్న గౌరవానికి మొదటి కారణం ఇది. వీరిద్దరిలోనూ గోపాలరెడ్డిగారితో నాకు చనువూ పరిచయమూ ఒకపాలు ఎక్కువ. చాలా సరసుడు. సంస్కృతంలో చక్కటి కవిత్వం రాసినవాడు. కాఫీ శ్లోకాలూ టీ శ్లోకాలూ ఎన్నో వారి నోటనే విన్నాను. సుజాతమ్మగారిది కొంచెం గంభీరస్వభావం. అందుకని వారి చెంత బెరుకు బెరుకుగానే ఉండేవాణ్ణి. ఇప్పటికీ అంతే. దీనికి తోడు ఈ విదుషీమణి చాలా మితభాషిణి. వీరిద్దరి కలయికతోనూ లోకానికి కలిగిన లాభం ఏమిటంటే– సమగ్రంగా అందిన సంస్కృత సాహిత్య చరిత్ర గ్రంథం. సాహిత్య విద్యార్థులందరికీ ఇప్పటికీ ఇదే దిక్కు. ఈ కృతజ్ఞతను ప్రకటించుకోడానికి ఇంతకాలానికి ఇలా ఒక అవకాశం లభించింది. లభించింది అనడం కన్నా అందించారు సుజాతారెడ్డిగారు అనడం సబబు.

మరొక్కమాట చెప్పి అసలు విషయంలోకి వెడతాను. దాదాపు పదహారు గ్రంథాలు రచించి ప్రచురించి మరిన్నింటికి సంపాదకత్వం వహించి విమర్శకురాలిగా నవలా రచయిత్రిగా కథా రచయిత్రిగా వ్యాస రచయిత్రిగా సాహిత్య ప్రాసంగికురాలిగా ఎనభయ్యవ దశకం నుంచీ లబ్ధప్రతిష్ఠురాలిగా ఉన్న సుజాతారెడ్డిగారు నేను విన్నంత కన్నంతలో ఏనాడూ పదవులకోసం పురస్కారాలకోసం పాకులాడలేదు. పైరవీలు చెయ్యలేదు. కులం మతం లింగం ప్రాంతం ఇత్యాదులన్నింటినీ– వైదుష్యం సామర్థ్యం తప్ప– సాధనాలుగా బాహాటంగా ఉపయోగించుకుంటూ పదవులకు ఎగబడుతున్నవారి సంఖ్య దినదినాభివృద్ధి చెందుతున్న ఈ నిర్లజ్జామహాయుగంలో సుజాతమ్మగారు వీటికి దూరంగా పవిత్రంగా నిలబడ్డారు. ఇది నా గౌరవభావానికి మరో హేతువు.

కేవలం సంస్కృతాంధ్రాలలో పాండిత్యమొకటే కాదు, హిందీ ఆంగ్లం జర్మనీ భాషా సాహిత్యాదులతోనూ– దేశాలతోకూడా– ప్రగాఢమైన పరిచయం వీరికి ఉంది. దీనివల్ల– సహజమైన వీరి అధ్యయనశీలానికి విస్తృతి అనేది ఇబ్బడి ముబ్బడిగా పరిఢవిల్లింది. కావ్యాలతో ప్రారంభించి యాత్రాకథనాలవరకు సమస్త ప్రక్రియలనూ సాహితీశాఖలనూ ఆపోశన పట్టింది. వాటిలో తనకున్న సృజనశక్తినీ చాటి చెప్పింది. చరిత్ర రాజకీయార్థిక సామాజిక శాస్త్రాలనూ స్పృశించింది. అధ్యయనంలోని ఈ తరహా విస్తృతివల్ల– సహిష్ణుత, నిష్పాక్షికత, విచక్షణత అనే గుణత్రయం సిద్ధిస్తుంది. అప్పుడు– సప్తద్వీపాలకూ విస్తరించిన సాహితీసింధువు కాస్తా వచ్చి వచ్చి అరచేతిలో అమృతబిందువు అయిపోతుంది. సాహితీ

భూగోళం ఒక సాహితీ కుటీరం అయిపోతుంది. అవగాహన పరిధి- వ్యాకోచిస్తే, అవగాహ్య విస్తృతి- ఘనీభవిస్తుంది. రత్నమవుతుంది. ఇదొక అవగాహనపరమైన ప్రపంచీకరణ. బహుశః సుజాతారెడ్డిగారు దీనినే అద్యతన దృష్టి అన్నారనుకుంటాను.

మనువసు చరిత్రల తులనాత్మకాధ్యయనం సాక్షిగానూ, ఈ సంపుటిలోని మొదటి నాలుగు వ్యాసాలు సాకిరిగానూ, సుజాతారెడ్డిగారి దృక్పథం- సాంప్రదాయిక భూమిలో వేళ్ళూనుకొని ఊడలు దిగిన వటవృక్షమని తేలికగానే గుర్తించవచ్చు. కానీ వామపక్ష భావజాలం మీద వీరు విరుచుకుపడ్డ వైనం ఎక్కడా కనిపించదు. పైగా అందులోని మేలిమిని తలకెత్తుకున్న ధోరణి- ఈ సంపుటిలోనే- కథలమీద నవలల మీద వీరు రాసిన వ్యాసాలలో చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఇది వీరి అద్యతనదృష్టిలోని సహిష్ణుతాపార్శ్వం. ఉద్యమాలూ పోరాటాలూ వాదాలూ వేదనలూ- వీటి స్పృహతో రచించిన వ్యాసాలలో వాటి జయాప జయాలను మదింపు వెయ్యడంలో నిష్పాక్షికతా గుణం, ప్రాంతీయ చైతన్యం, సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణం- వీటి నేపథ్యంలో రూపొందిన వ్యాసాలలో విచక్షణతా లక్షణం- అంతే స్పష్టంగా కనిపిస్తాయి.

ఇక ముగింపులోని నాలుగు వ్యాసాలూ- వీరి అవిశ్రాంత అధ్యయనశీలానికి నిలువుటద్దాలు. ఆయా ప్రక్రియల్లో వస్తున్న సృజన సాహిత్యాన్ని సమగ్రంగా అధ్యయనం చెయ్యడంలో వీరు ఎంత ప్రత్యగ్రంగా ఉన్నారో ఆశ్చర్యం వేస్తుంది. విశ్వవిద్యాలయాలలోని చాలామంది బోధకులకే పట్టని బాధ. ఏనాడో పదవీవిరమణ చేసిన సుజాతమ్మగారిని ఈనాటికీ వదలడం లేదంటే ఆశ్చర్యం కాదా మరి! దానికేమిగానీ, అద్యతన దృష్టి అనే పేరు ఈ విమర్శవ్యాస సంపుటికి అక్షరాలా సార్థకమయ్యిందని సంభావిస్తూ సుజాతారెడ్డిగారిని మనసారా అభినందిస్తున్నాను.

సృజన సాహిత్యానికి పీఠిక రాయడంలో ఒక సౌలభ్యం ఉంది. విమర్శ వ్యాసాల సంపుటికి రాయాలంటే నాకు- అరవై అయిదేళ్ళు నిండి- ఇప్పటికీ కంగారే, భయమే. కానీ ఇటీవల ఒక ఒజ్జబంతిలాంటి పీఠిక చదివాను. ఆ పీఠికాకర్త సదరు సంపుటిలోని ఒక్కొక్క వ్యాసం నుంచీ తనకు కొత్తగా తెలిసిన ఒక్కొక్క అంశాన్ని వరుసగా గుదిగుచ్చి ఇతిశం అన్నాడు. భలే బాగుందిరా అనిపించింది. అదే పని నేనూ చేస్తున్నాను.

మనవాళ్ళు చెప్పిన వృక్షదోహదాలకు విజ్ఞాన శాస్త్ర సమ్మతి ఉంది. భారత శకుంతల ఆధునిక మహిళలకు ఆదర్శం కావాలి. రామాయణంలో జానపద కథానిర్మాణ రీతులు ఉన్నాయి. వ్యాస, భవభూతుల నుంచి విశ్వనాథ వరకూ వచ్చిన స్పర్శ సిద్ధాంతానికి మనస్తత్వ శాస్త్రంతో సంబంధం ఉంది. చరిత్ర నిర్మాణానికి సాహిత్యావశేషాలు పునాది రాళ్ళు. ఆబురూ (ఆబోరు) ఖాయిదా బెహద్బీ- లచారీలకు అర్థం తెలిసింది. కాళోజీని

రావూరి భరద్వాజను సాహితీలోకం మరిచిపోకూడదు. ప్రాంతీయ అస్తిత్వ వేదనలోనూ సార్వకాలికత సార్వజనీనత ఉంటాయి. ఇది ప్రపంచీకరణకు- నికద్దమ్ ప్రతిద్వంద్వి. తెలంగాణా కవిత- కథ- నవల అన్నింటా ఇది అద్భుతంగా ఆవిష్కృతమయ్యింది. వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషిగా ఎదిగిన క్రమమే అతడి నవల. దాశరథి కవిగా విశ్వమానవతావాది. మిగతా వ్యాసాలలోని సారాంశాలను ముందటి పేరాలలో పరోక్షంగా ప్రస్తావించాను. కనుక- పునరుక్తం చెయ్యను.

ఇది పాఠకులకు అన్నివిధాలా లాభసాటి వ్యాససంపుటి. పూర్తిగా గిట్టుబాటు అవుతుంది. స్వానుభవంతో ఇస్తున్న భరోసా సుజాతారెడ్డిగారికి ధన్యవాదాలు చెబుతూ, ఆబోరు దక్కించుకున్నానని సంబరపడుతూ సెలవు.

భవదీయుడు

హైదరాబాద్

11.12.2013

***(బేతవోలు రామబ్రహ్మం)***

# నా మాట

**డా**క్టరేటు డిగ్రీ వచ్చినతర్వాత నేను ఎక్కువగా విమర్శమీద దృష్టిని పెట్టి విమర్శ వ్యాసాలు రచించటం ఆరంభించాను. అప్పట్నుంచి ఇప్పటివరకు నేను పత్రికలకు వ్రాసిన సాహిత్య విమర్శ వ్యాసాలు సాహిత్య సదస్సుల్లో సమర్పించిన పత్రాలు చాలా వున్నాయి. వాటిల్లోనుంచి కొన్నిటిని నేను ఉత్తమమైనవని అనుకున్నవాటిని ముప్పైవరకు ఎన్నుకొని "అద్యతన దృష్టి" పేరుతో సాహిత్యవిమర్శ వ్యాసాల గ్రంథాన్ని తెస్తున్నాను. ఈ గ్రంథంలో 1978 నుంచి 2013 వరకు వ్రాసిన వ్యాసాలున్నాయి. మొదటి రెండు వ్యాసాలు నా సిద్ధాంత వ్యాసం శైలిలో సరళ గ్రాంథికంలో వున్నాయి. 1975 నాటివరకు ఆ తర్వాత కూడా విశ్వవిద్యాలయాల్లో సిద్ధాంతవ్యాసం సరళ గ్రాంథికంలో వ్రాయాలనే నియమం వుండేది. అంటె అప్పటివరకింకా విశ్వవిద్యాలయాల్లో సరళగ్రాంథికమే ప్రామాణికంగా వుంది. అందుకే మొదట్లో నేను వ్రాసిన సాహిత్య విమర్శ వ్యాసాలు కొన్ని సరళ గ్రాంథికంలోనే వున్నాయి. తర్వాత నేను వ్యవహారిక భాషలో నాదైన ఒక శైలిని ఏర్పరుచుకొని వ్రాయటం మొదలు పెట్టాను. క్రమంగా సాహిత్య విమర్శలో నాదైన శైలి నాదైన మార్గం ఏర్పడింది.

ఈ గ్రంథంలో నిత్యనూతనమైన దృక్పథం ఎన్నటికీ మాసిపోని చెల్లుకాని భావజాలంతో కూడిన సాహిత్య వ్యాసాలు వున్నాయి– అని నేను ఈ గ్రంథానికి "అద్యతన దృష్టి" అనే పేరు పెట్టాను. ఈ వ్యాససంపుటికి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం (బేరా)గారు ఆత్మీయమైన సునిశిత పరిశీలనను మేళవించి చక్కని ముందుమాట "సమీక్ష" పేరుతో వ్రాశారు. వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

నా రచనాకృషిలో నిరంతరం నాకు ప్రోత్సాహాన్నిచ్చి నా భర్త ఆచార్య ముదిగంటి గోపాలరెడ్డిని ఈ తరుణంలో స్మరించకుండా వుండలేను. శ్రద్ధతీసుకొని ఈ పుస్తకానికి రూపకల్పన చేసిన 'పుస్తకశిల్పి' శ్రీతాళ్ళపల్లి మురళీధర గౌడుగారికి, అందమైన ముఖచిత్రాన్ని రూపొందించిన శ్రీ టి.మల్లేశ్‌గారికి, డి.టి.పి. చేసిన శ్రీ కె.బి.టి. కొండయ్యగారికి, సకాలంలో ముద్రించి ఇచ్చిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ అధినేత శ్రీ జగన్మోహనరెడ్డిగారికి ధన్యవాదాలు.

రోహణమ్ *ముదిగంటి సుజాతారెడ్డి*

02-01-2014

# వ్యాస సూచిక

1. దోహదక్రియలు ---------------------------------- 09
2. వ్యాస కాళిదాసుల శకుంతలలు ------------------------ 14
3. రామాయణ, బాలనాగమ్మ కథలకు మూలం ఒక్కటేనా? ------- 19
4. విశ్వనాథ-భవభూతి స్పర్శ సిద్ధాంతం ------------------- 25
5. సాహిత్యంలో ప్రతిఫలించిన చరిత్ర---------------------- 34
6. కన్యాశుల్కంలో ఉర్దూ పదాలు ------------------------ 41
7. కాళోజీ జీవిత చరిత్ర తెలంగాణ చరిత్ర ------------------ 49
8. "పాకుడురాళ్ళు"- సినిమా జీవితం ---------------------- 56
9. '300' సినిమా సామ్రాజ్యవాదం వికృతరూపం -------------- 64
10. తెలంగాణ పోరాటంలో పాల్గొన్న వీరవనితలు -------------- 67
11. తెలంగాణా ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వం ---------------- 74
12. ప్రపంచీకరణ లక్షణాలతో ప్రాంతీయ అస్తిత్వవాదం ----------- 88
13. విశిష్ట అస్తిత్వంతో అలరారే తెలంగాణ తెలుగు కథ ----------- 92
14. కథలు, నవలలు- ప్రాంతీయ చైతన్యం ------------------ 100
15. సామ్రాజ్యవాదం ప్రపంచీకరణం- ఒక్కటేనా? -------------- 111
16. అన్నిటికీ ప్రపంచీకరణమే కారణమా? ------------------- 115
17. ముస్లింల వేదనకు ప్రతిబింబమే ముస్లిం సాహిత్యం ----------- 118
18. ముస్లిం చైతన్య కథలు "వతన్" ----------------------- 120
19. స్త్రీవాదానికి విస్తృత నేపథ్యం ------------------------- 127
20. స్త్రీవాదం-జయాపజయాలు ---------------------------- 132
21. రచయిత్రుల నవలలు -------------------------------- 140
22. జాతీయోద్యమం-తెలుగు నవలా సాహిత్యం --------------- 148
23. తెలంగాణా పోరాట నవలలు -------------------------- 157
24. ఆళ్వారుస్వామి నవలల్లో ప్రజాజీవితం ------------------- 166
25. తొలితరం కథానిక రచయిత్రులు- కృషి-యోగదానం --------- 180
26. కాగితం కొరతే కారణం! ------------------------------ 190
27. తెలుగు కథల విమర్శనా సాహిత్యం -------------------- 194
28. తెలుగు నవలల మీద విమర్శనా సాహిత్యం --------------- 199
29. "చర్చ"- సాహిత్య విమర్శ శోధనం ---------------------- 203
30. "తిమిరంతో సమరం"- దాశరథి ------------------------ 208

# 1. దోహదక్రియలు

**మా** పెరట్లో ఆనప (సొర) తీగ బాగా పచ్చగా, ఏపుగా పెరిగింది. చాలా కాయలు పడుతాయని అనుకున్నాము. అనుకున్నట్లుగానే చాలా పిందెలు వచ్చినవి. కాని ఆ పిందెలన్నీ కొద్దిగా పెరగగానే ఎర్రబడి రాలిపోసాగాయి. అగ్రికల్చర్ డిపార్టుమెంటులో పనిచేసే ఒక మిత్రుడు ఆ తీగకు ఏదో మందు కొట్టమని పేరు చెప్పాడు. నాకు అటువంటి రసాయనిక మందులు కొట్టడం ఇష్టంలేదు. ఆ మందులు పిందెలను రక్షిస్తాయేమో కాని ఆ విధంగా నిలిచిన కాయలను తినడం హానికరమేమో అని భయం కలిగింది. ఇంతలో మా పనిమనిషి వూదు (సాంబ్రాణి) పొగను ఆ ఆనప (సొర) పాదు దగ్గర వేయండి అని సలహా ఇచ్చింది. తీగ చాలా పెరిగి ఎగబాకింది కదా, పాదు దగ్గర మాత్రం వూదుపొగ వేస్తే లాభం ఏమిటని అశ్రద్ధ చేశాను. తరువాత ఒక రోజు మా పనిమనిషే వూదు తెచ్చి తీగ మొదట్లో పొగను పట్టించింది. దాని తరువాత కొద్ది రోజులలోనే ఫలితం కనబడింది. పిందెలు ఎర్రబడి రాలిపోకుండా ఆరోగ్యంగా నిలిచాయి. బాగా కాయలు కూడా వచ్చాయి. ఇది నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. అప్పుడు నాకు నైషధీయ చరితంలో శ్రీహర్షుడు చెప్పిన శ్లోకం గుర్తుకు వచ్చింది–

*"విదర్భ సుభ్రూస్తన తుంగ తాప్తయే*
*ఘటాని వా పశ్యదలం తపస్యతః*
*ఫలాని ధూమస్య ధయా నదో ముఖాన్*
*సదాడిమే దోహద ధూపిని ద్రుమే"* (నై. చ. 1–82)

ఈ శ్లోకమును శ్రీనాథుడు శృంగార నైషధంలో ఈ కింది విధంగా అనువదించినాడు–

*"దమయంతీ స్తనకుంభ విభ్రమముఁ*
*బొందంగోరుటన్ ధూమ పా*
*నము గావించుచధోముఖంబులగు నానా*
*కుంభముల్ వోలె ధూ*

*పములన్ దోహద మాచరింపగ గడుం*
*బక్వంబులై యున్న దా*
*డిమముల్ సూచి నృపాలకుండు మదిఁ*
*బాటించెన్ మహౌత్సుక్యమున్"* (శృం.నై. 1-95)

దమయంతీ స్తనకుంభ ద్వయ విభ్రమమును పొందగోరి అదోముఖములై ధూమపానము చేయుచు తపస్సు చేయుచున్నవా అన్నట్లున్న, కుంభములవలె పెద్దవైన దాడిమ ఫలములను నలుడు ఉద్యానవనమున చూచినాడు. ఇట కవి దమయంతీ స్తనవిభ్రమమును వర్ణిస్తూ దాడిమఫలములు పెద్దవగుటకై చేసే ధూమపానమను దోహదక్రియను వర్ణించినాడు. ఈ ధూమము దేనిచేత చేయబడిందో కవి చెప్పలేదు. కవికి అది అప్రస్తుతము. కాన వ్యాఖ్యాకారుడు మల్లినాథుడు ఆ దోహదక్రియను ఇట్లు వివరించినాడు-

*"మేషామిషాంబు సంసేకస్తత్కేశామిష ధూపనమ్*
*శ్రేయానయం ప్రయోగః స్యాద్దాడిమీఫల వృద్ధియే*
*మత్స్యాజ్య త్రిఫలాలేపై ర్మాంసై రాజావికోద్భవైః*
*లేపితా ధూపితా సూతే ఫలంతాళీన దాడిమీ"*

మేక మాంసమును కడిగిన నీళ్లను దాడిమ లతకు పోయవలెను. మేకవెంట్రుకల యొక్క మరియు మాంసము యొక్క ధూపమును దానికి వేయవలెను. దీనిచేత ఫలవృద్ధి జరుగును. మత్స్య, ఆజ్య, త్రిఫలములచేత చేయబడిన లేపమును దాడిమీ లతకు పూయవలెను. గొర్రె మాంసముతో దానికి ధూపము వేయవలెను. తత్ఫలితంగా తాటిపండువలె పెద్దవైన దాడిమ ఫలాలు కాయును. దాడిమ ఫలాలు అధికసంఖ్యలో పెద్దవిగా కాయడానికి మరొక దోహదక్రియను మల్లినాథుడు ఉట్టంకించాడు-

*అవిక్వాదేన సంసిక్తా ధూషితా తప్త రోమభి*
*ఫలాని దాడిమీ సూతే సుబహూని పృథూనిచ*

గొర్రెమాంసాన్ని ఉడికించగా మిగిలిన నీళ్లను అనగా క్వాథ (డికాక్షన్) ను దాడిమీలతకు పోసి గొర్రెవెంట్రుకలతో ధూపం వేసినట్లయితే అధిక సంఖ్యలో కాయలు పెద్దవి కాయును. ఇట్ల ధూమధూపాది దోహదక్రియలను పూర్వకాలంలో తరుగుల్మలతాదులకు చేసేవారన్న మాట. దోహదక్రియ అంటే ఏమిటో మల్లినాథుడు శబ్దార్ణవం నుండి ఇట్లు ఉద్ధరించినాడు-

*తరుగుల్మలతాదీనా మకాలే కుశలైః కృతమ్*
*పుష్పాద్యుత్పాదకం ద్రవ్యం దోహదంస్యాత్తు తత్క్రియా*

అకాలంలో తరుగుల్మలతాదులకు పుష్పాదులను ఉత్పాదింపజేసే ద్రవ్యములతో చేసే క్రియను దోహదమందురని పై శ్లోకార్థము. అకాలంలో పుష్పాదులను ఉత్పాదింప జేయుటకే కాక కాయలు రాలిపోకుండా నిలపడానికి, కాసిన కాయలు, పండ్లు వృద్ధి పొందడానికి, కాయలను పండ్లను విరివిగా కాయించడానికి, దోహదక్రియలను ప్రయోగించే వారని నైషధంలో మల్లినాథుడు పేర్కొనిన పై శ్లోకములే చెప్పుచున్నవి. కాయలను పండ్లనే గాక అనేకవిధాలైన పూవులను సమృద్ధిగా పుష్పింపజేయడానికి దోహదక్రియలను ప్రయోగించేవారు. వేర్లలో లోపమువల్ల ఖనిజ పదార్థాల లోటువల్ల లేక నేలలో పురుగులు ఉండడం వల్ల, చెట్లు ఆరోగ్యంగా ఉండక, పూసిన పూతగాని కాయలుగాని నిలువకుండా పోవడం జరుగుతుంది. ఈ దోషాలను, లోపాలను పోగొట్టేందుకు ఈ దోహద క్రియలు తోడ్పడుతాయి. ఈ దోహద క్రియలను తెలిసిన కుశలురుండెడివారని పై శ్లోకములోని 'కుశలై కృతమ్' అను పదప్రయోగాన్నిబట్టి తెలియుచున్నది. అట్టి వ్యక్తి ఒకడు శ్రీ ఖండదాస ధార్మికుడను పేరుగలవాడు శ్రీహర్షదేవుడు రచించిన (క్రీ.శ. 7వ శతాబ్దము) రత్నావళి నాటిక ద్వితీయాంకంలో మనకు తటస్థపడతాడు. ఈ శ్రీఖండదాస ధార్మికుడు ఉదయనునకు అభిమానం గల నవమాలికా లతను పుష్పింపజేయడానికి నియమింపబడినాడు. శ్రీ ఖండదాస ధార్మికునిచే దోహదక్రియ పొంది దట్టముగా పూలగుత్తులతో శోభిల్లుతున్న నవమాలికా లతను, దోహద క్రియలో విశేషమైన నమ్మకం గల ఉదయనుడు విదూషక సహాయుడై దర్శించడానికి వస్తాడు. పట్టపురాణి వాసవదత్తా దేవి సైతం సఖీ సహాయయై దోహదక్రియా విశేషంవలన విరివిగా పుష్పించిన నవమాలికను దర్శించడానికి వస్తుంది. పుష్పించిన ఈ నవమాలికాలత వాసవదత్తా దేవి ప్రేమగా పెంచుకొన్న మాధవీలతను పరిహసించు చున్నట్లున్నదని విదూషకుడు అంటాడు. దీనిని బట్టి ఆనాడు రాజులు, రాణులు సైతం తరులతలను తమ ఉద్యాన వనములలో ఎంత ప్రేమతో, అభిమానముతో పోటీపడి పెంచుకునేవారో తెలియవస్తున్నది. ప్రేమాభిమానములతో పెంచుకోవడమే కాక వాని ఫల పుష్ప వృద్ధికై ఎంతటి శ్రద్ధ వహించు చుండిరో ఆనాడు దోహదక్రియా విశేషాలు ఎంతగా ప్రచారంలో ఉండేవో తెలియుచున్నది.

శ్రీహర్షుని నైషధీయ చరితంలోని దమయంతీ స్తన విభ్రమముతో పాటు దాడిమీలతకు చేసే దోహదక్రియ సూచించబడిన పై శ్లోకమువంటి పద్యమొకటి రామరాజభూషణుని వసు చరిత్రలో ఉన్నది. రామరాజభూషణుడు దాడిమలతను

లలితాంగిగా, దోహదరూపమైన ధూమధూపములను వేల్లిత కుంతలములుగా ఇట్లు ఊహించినాడు-

*చలిత లతాంతకాంతి యను చందురు కావి చెరంగు దాఁటి స*
*మ్మిళిత వయోవిలాసముల మీటిన విచ్చు ఫల స్తనాగ్రము*
*ల్వెలువడఁగప్పె తక్షణమ వేల్లిత దోహ ధూప ధూమ కుం*
*తలములు విప్పి దాడిమ లతాలలితాంగి నృపాలు చెంగటన్.*

(వ.చ. 1-157)

విజయనగరం బాహ్యోద్యానములకు, భవనోద్యానములకు ప్రసిద్ధి చెందినది. "దోహద ధూప ధూమములతో గనుపట్టెడి తత్పురీ వన వ్యూహమునో సమస్త విబుధోత్తమ చూచితె..." అని పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నమున విజయనగర ఉద్యాన వనములలో వేయబడు ధూపధూమములను గూర్చి ఇక్కడ ప్రసంగించినాడు. సూరన ప్రత్యేకంగా ధూపధూమములను దాడిమ లతలకు వేసినట్లుగా పేర్కొనకపోవుటచే దాడిమ లతలకే కాక ఇంతర తరుగుల్మ లతాదులన్నిటికీ ఈ దోహదరూపమైన ధూపధూమములను వేసెడి వారని ఊహించవచ్చును. పింగళి సూరనవలె రామరాజ భూషణుడు కూడా విజయనగర కవి. అతనికి రత్న శాస్త్ర, సంగీత శాస్త్రములందే గాక వ్యవసాయం, తోటల పెంపకంలో మిక్కిలి అభిరుచి, అందుచేతనే అతడు శ్రీహర్షుని వలె ధూపధూమములతో చేసే దోహదక్రియలను వర్ణిస్తూ పద్యమును రమ్యముగా అల్లినాడు. ధూపధూమమునే గాక మరికొన్ని విచిత్రమైన దోహదక్రియలనుకవులు పేర్కొనినారు. అవి ఈ కింద చెప్పబడిన దోహద విశేషములు-

*అశోకశ్చరణాహత్యా వకులో ముఖసేధునా ఆలిఙ్గనాత్కురువకస్తిలకో వీక్షణే నచ కరస్పర్శేన మాకన్దముఖరాగేణ చమ్పకః సల్లాపతః కర్ణికారస్సిన్దువారో ముఖానిలాత్ గీత్యా ప్రియాళుర్నితరాం నమేరుర్హసితేనచ*

అశోకము పాద తాడనముతో, నకుళము మధువును పుక్కిలించి ఉమియుటచే, కురువకము ఆలింగనముచే, తిలకము వీక్షణములచే, మాకందము హస్తస్పర్శచే, చంపకము ముఖ రాగముచే, కర్ణికారము సల్లాపముచే, సింధూవారము ముఖవాయువుచే, ప్రయాళువు గానముచే, నమేరు నవ్వుటచే పుష్పించునట. ఈ అంగనాదోహదములను రామరాజ భూషణుడు వసుచరిత్రలో - 2 ఆశ్వా. 158, 159, 3 ఆశ్వా. 146, 147 పద్యములలో పేర్కొనినాడు. అతడే గాక అనేక సంస్కృత కావ్య నాటక కర్తలు, తెలుగు కావ్యకర్తలు పై అంగనాదోహదములను పేర్కొనినారు.

తరులతలు మానవుల ప్రేమ సహృదయతలను గ్రహింపగల వనియు, సంగీతాదులచే హర్షము నొందగలవనియు ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు పరీక్షలు చేసి చెప్పుచున్నారు. తమను పెంచే వ్యక్తుల ప్రేమతోకూడిన స్పర్శ, సంలాపాదులను మరియు కోపాలాపములను శునకాది పెంపుడు జంతువుల వలె తరు లతలును గ్రహించి ప్రవర్ధిల్లుచుండుననియు వారు చెప్పుచున్నారు (చూడుము- ద సీక్రెట్ లైఫ్ ఆఫ్ ప్లాంట్సు- అతుల్ మఖ్తుంకర్. జనవరి 1977 మిర్రర్ పత్రిక). అటువంటప్పుడు పైన చెప్పిన అంగనా దోహదములు నిజంగానే తరులతల మీద పనిచేయునేమో శాస్త్రీయంగా పరిశీలింపవలసి ఉన్నది.

మన పూర్వజులు అనుభవంతో చెప్పిన వ్రాసిన దోహదక్రియా విశేషాలను కేవలం కవి సమయములుగా గ్రహించి సంపూర్ణావగాహన చేసుకోకుండా వదలి వేస్తున్నాము. పూర్వం ఎన్నియో దోహదక్రియా విశేషాలు ప్రచారంలో ఉండేవి. వానిని తెలిసిన విశేషజ్ఞులు ఉండేవారు. వానిని ప్రయోగంలో పెట్టేవారు. ఇప్పుడు మనము కావ్యనాటకములలో చదివే దోహదక్రియలను కవి సమయములుగా మాత్రము గ్రహింపక శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి హాని కలిగించే రసాయనిక మందులను వాడకుండా జనసామాన్యానికి తెలిసేటట్లుగా చేయుటం మంచిదేమో?

*ఆంధ్రప్రభ, 14 జనవరి 1978*

# End of Preview.

# Rest of the book can be read @

**http://kinige.com/book/Adyatana+Drushti**

* * *